https://epaper.manasamajam.com Contact No. 9989788438, 9505285656

# మన సమాజం

తెలుగు డిజిటల్ దిన పత్రిక

Truth towards the Society

చైర్మన్ : పార్వతి సురేష్ కుమార్ ఎడిటర్ : పార్వతి రాజేష్ కుమార్

సంపుటి : 02 సంచిక : 50 ఆదివారం 21-06-2026 పేజీలు : 4

**రిపోర్టర్స్ కావలెను**

మన సమాజం
Truth towards the Society

మన సమాజం తెలుగు డిజిటల్ దినపత్రికలో
నిఖార్సైన జర్నలిస్టుగా నిలబడాలనుకుంటున్నారా?
అన్ని తరహా వార్తలు, కథనాలు ఎలాంటి ఆంక్షలు లేకుండా రాయాలని కోరుకుంటున్నారా?

తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు, మండలాలల్లో పనిచేసేందుకు విలేఖరులు కావలెను...
మీ కలాలకు పదును పెట్టండి.

సంప్రదించవలసిన నెంబర్లు
9989788438, 9505485656.

## కార్మికుల సమస్యలపై
# కవిత ఆగ్రహం

**డిపెండెంట్ ఉద్యోగాలపై ప్రభుత్వానికి నెల గడువు**

**భూపాలపల్లిలో జెండా పండుగ కార్యక్రమం**

**కార్మికుల పక్షాన పోరాటం కొనసాగిస్తామని స్పష్టం**



**భూపాలపల్లి, జూన్ 20**
తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత భూపాలపల్లి జిల్లాలోని కాకతీయ ఖని-5 గని వద్ద కార్మికులతో సమావేశమై వారి సమస్యలను తెలుసుకున్నారు. సింగరేణి బాయిబాట కార్యక్రమంలో భాగంగా కార్మికులతో నేరుగా మాట్లాడిన ఆమె, డిపెండెంట్ ఉద్యోగాల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ డిపెండెంట్ ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్న కుటుంబాలకు ప్రభుత్వం నెల రోజుల్లో న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

## రైతుల సమస్యలను పరిష్కరించడంలో
# ప్రభుత్వం విఫలం

### బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**ఆదిలాబాద్, జూన్ 20**
జొన్న పంటను విక్రయించలేక మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్న ఆదిలాబాద్ జిల్లా సిరికొండ మండలం పొన్న గ్రామానికి చెందిన రైతు నుగురే పాండురంగ్ కుటుంబాన్ని పరామర్శించేందుకు బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ శనివారం ఆదిలాబాద్ జిల్లాకు చేరుకున్నారు. రైతు కుటుంబానికి అండగా నిలిచి వారి సమస్యలను తెలుసుకునేందుకు ఆయన ఈ పర్యటన చేపట్టారు. పొన్న గ్రామానికి వెళ్తున్న క్రమంలో నేరడిగొండ వద్ద కేటీఆర్‌కు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు.

బోథ్ నియోజకవర్గ శాసనసభ్యుడు అనిల్ జాదవ్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో హాజరై స్వాగతం తెలిపారు. కేటీఆర్ రాకతో ఆ ప్రాంతంలో రాజకీయ సందడి నెలకొంది. జొన్న పంటకు సరైన ధర లభించకపోవడం, విక్రయించడంలో ఎదురైన ఇబ్బందుల కారణంగా రైతు పాండురంగ్ తీవ్ర మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకు న్నట్లు కుటుంబ సభ్యులు, స్థానికులు పేర్కొంటున్నారు. ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారగా, రైతు కుటుంబాన్ని పరామర్శించి వారికి భరోసా కల్పించేందుకు కేటీఆర్ ముందుకు వచ్చారు. పొన్న గ్రామానికి చేరుకున్న అనంతరం కేటీఆర్ బాధిత కుటుంబ సభ్యులను కలిసి వారి సమస్యలను తెలుసుకోనున్నారు. రైతు మరణానికి దారితీసిన పరిస్థితులపై వివరాలు సేకరించడంతో పాటు కుటుంబానికి పార్టీ తరఫున సంఘీభావం ప్రకటించ నున్నారు. ప్రభుత్వం రైతుల సమస్యలను పరిష్కరించడంలో విఫలమైందని బీఆర్ఎస్ నేతలు ఆరోపిస్తున్నారు. రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రజల ముందుకు తీసుకురావడమే తమ లక్ష్యమని బీఆర్ఎస్ నాయకులు పేర్కొంటున్నారు. పంటలకు గిట్టుబాటు ధరలు, కొనుగోలు సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వం మరింత చొరవ చూపాలని వారు డిమాండ్ చేస్తున్నారు. రైతుల సంక్షేమం కోసం తమ పార్టీ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేస్తున్నారు. కేటీఆర్ పర్యటన సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రైతు కుటుంబానికి న్యాయం జరగాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలని వారు కోరారు. రైతుల సమస్యలపై తమ పోరాటం కొనసాగుతుందని బీఆర్ఎస్ నాయకత్వం ప్రకటించింది.

## టీఎంసీ నిధులు
# 440 కోట్లు ఫ్రీజ్



**కోల్‌కతా, జూన్ 20:**
పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తరువాత నిలువునా చీలిన తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ)కు మరో ఎదురుదెబ్బ తగిలింది. పార్టీకి చెందిన రూ.440 కోట్ల నిధులను పోలీసులు స్తంభింపజేశారు. పార్టీకి బ్యాంకు ఖాతాల్లో రూ.676.11 కోట్ల నగదు నిల్వలు ఉన్నాయి. అయితే, అసలైన టీఎంసీ తమదేనని, పార్టీ గుర్తుతో సహా ఆస్తులు కూడా తమకే దక్కుతాయని చీలిక వర్గం వాదిస్తోంది. రితబ్రత బెనర్జీ నేతృత్వంలోని ఈ చీలిక వర్గానికి చెందిన 10 మంది ఎమ్మెల్యేలు ఈ నిల్వలను స్తంభింపజేయాలని సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సొమ్ము అక్రమ మార్గాల ద్వారా సేకరించినదని, దానిని ఎవరెవరి నుంచి ఎలా సేకరించారో దర్యాప్తు నిర్వహించాలని కోరారు. వెంటనే స్పందించిన పోలీసులు మూడు బ్యాంకుల్లో ఉన్న రూ.440 కోట్లను శనివారం ఫ్రీజ్ చేశారు. ఇకపై ఈ డబ్బును బ్యాంకు ఖాతాల నుంచి తీసుకోవటం, ఇతర ఖాతాలకు మళ్లించటం కుదరదని చెప్పారు.

# రేపు ఢిల్లీకి వస్తున్నా

**రెండు రోజులు అక్కడే ఉంటా**

**రైల్వేమంత్రితో భేటీ ఏర్పాటు చేయించండి**

**ఆ వివరాలను వీలైనంత త్వరగా తెలపండి**


**కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి సీఎం రేవంత్ లేఖ**



**హైదరాబాద్, జూన్ 20**
హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టుకు సంబంధించిన పెండింగ్ అంశాలపై చర్చించేందుకు కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో సమావేశం ఏర్పాటు చేయించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు శనివారం కిషన్‌రెడ్డికి మరోసారి లేఖ రాశారు. మెట్రో ఫేజ్-2 విస్తరణకు సంబంధించి సమస్యలు త్వరితగతిన పరిష్కారమయ్యేలా జోక్యం చేసుకోవాలన్నారు. ఇందుకు సంబంధించి ఈ నెల 16న రాసిన లేఖనూ తాజా లేఖలో ప్రస్తావించారు. ఈ నెల 22, 23 తేదీల్లో తాను ఢిల్లీ పర్యటనకు వస్తున్నానని, ఈ సందర్భంగా రైల్వే మంత్రితో సమావేశం ఏర్పాటుకు చొరవ తీసుకోవాలని కోరారు. హైదరాబాద్ నగరం, తెలంగాణ రాష్ట్రానికి అత్యంత కీలకమైన పట్టణ మౌలిక సదుపాయాల ప్రాజెక్టుగా హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టుకు అత్యంత ప్రాధాన్యంఉందని లేఖలో సీఎం పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో పెండింగ్ అంశాలు సత్వరం పరిష్కారం కావాలని అభిలషించారు. అశ్వినీ వైష్ణవ్‌కు మెట్రోకు సంబంధించిన అన్ని అంశాలను సమగ్రంగా వివరిస్తానని, చర్చలకు అవసరమైన.. సంబంధిత ఒప్పందాలు, ఇతర పత్రాల ప్రతులను కూడా వెంట తీసుకువస్తానని తెలిపారు.

# హైదరాబాద్‌లో బ్రిక్స్ సమావేశం

**హైదరాబాద్, జూన్ 20**
ప్రపంచంలోని ప్రధానంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల కూటమి బ్రిక్స్‌కు సంబంధించిన కీలక సమావేశం హైదరాబాద్‌లో జరగనుంది. బ్రిక్స్ యాంటీ-కరప్షన్ వర్కింగ్ గ్రూప్(ఏసీడబ్ల్యూజీ) రెండో సమావేశాన్ని ఆగస్టు 4,5 తేదీల్లో నగరంలో నిర్వహించేందుకు కేంద్ర ప్రజా ఫిర్యాదులు, పెన్షన్ల మంత్రిత్వశాఖ ఏర్పాట్లు ప్రారంభించింది. సమావేశ నిర్వహణ కోసం ఈవెంట్ మేనేజ్‌మెంట్ సంస్థల నుంచి టెండర్లు కూడా ఆహ్వానించింది. ఈ సమావేశాల్లో అవినీతి నిరోధం, అక్రమ ఆస్తుల గుర్తింపు, అంతర్జాతీయ సహకారం, పారదర్శక పాలన తదితర అంశాలపై చర్చలు జరిగే అవకాశం ఉంది.





- విత్తన సరఫరా నుంచి మార్కెటింగ్ దాకా..
- అడుగడుగునా రైతులకు సర్కారు సాయం
- మాటిచ్చినట్టే 'అన్నదాత-సుఖీభవ' అమలు
- 46.86 లక్షల ఖాతాల్లో 3,125 కోట్లు జమ
- యుద్ధం వేళ ఆక్వా రైతులను ఆదుకున్నాం
- తోతాపురి టన్నుకు రూ.4,000 సాయం
- ఎరువుల విపరీత వాడకంతో అనర్థాలెన్నో..
- ప్రకృతి సాగుతో ఖర్చు తక్కువ.. ఆరోగ్యమూ..
- చిలకలూరిపేటలోని లింగంగుంట్లలో సీఎం చంద్రబాబు నాయుడు

# అన్నదాతకు అండ

**చిలకలూరిపేట, జూన్ 20:**
రాష్ట్రంలో రైతులకు కూటమి ప్రభుత్వం అండగా ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. విత్తన సరఫరా దగ్గర నుంచి మార్కెటింగ్ వరకు ఎక్కడా రైతులు నష్టపోకుండా గత రెండేళ్లుగా పలు కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం లింగంగుంట్లలో శనివారం జరిగిన అన్నదాత సుఖీభవ- పీఎం కిసాన్ పథకం నిధుల విడుదల కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు. బటన్ నొక్కి 46.86 లక్షల మంది రైతుల ఖాతాలకు రూ.3,125 కోట్లు జమ చేశారు. 'నా జీవితంలోనే అత్యంత ఆనందకరమైన రోజు ఇది' అని ఈ సందర్భంగా చంద్రబాబు సంతృప్తి వ్యక్తం చేశారు. పీఎం కిసాన్ కింద రూ.2,000, అన్నదాత సుఖీభవ కింద రూ.5,000...మొత్తం రూ 7,000 రైతుల ఖాతాల్లో జమ చేశామని తెలిపారు. ఇందులో కేంద్రం వాటా రూ.782 కోట్లు, రాష్ట్రం వాటా రూ.2,343 అని, రెండూ కలిపి రూ.3,125 కోట్ల కోసం బటన్ నొక్కాం." అని ఆయన వివరించారు. కూటమి చేస్తున్న ఇలాంటి మంచి కార్యక్రమాలతో పాటు గత ప్రభుత్వం చేసిన విధ్వంసాన్నీ ప్రజలు గుర్తుపెట్టుకోవాలని కోరారు. ఆ రోజు 12,500 ఇస్తామని చెప్పి.. రూ.7,500 మాత్రం రైతులకు ఇచ్చి చేతులు దులుపుకొన్నారని వైసీపీపై ఆయన ధ్వజమెత్తారు. విధ్వంసం నుంచి వికాసం వైపు రాష్ట్రాన్ని తీసుకెళుతున్నామని తెలిపారు. "ఒకప్పుడు ధాన్యం అమ్మితే ఆరు నెలలకు కూడా డబ్బులిచ్చేవారు కాదు. ఈ రోజు ధాన్యం విక్రయించిన 48 గంటల్లోనే రైతు ఖాతాల్లో డబ్బులు పడుతున్నాయి." అని తెలిపారు. లేబర్ ఖర్చు, వ్యవసాయం ఖర్చులు పెరుగుతుండగా, ఆదాయం తగ్గుతోందని, అందుకే యాంత్రీకరణకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. రైతులు బాగుంటేనే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బాగుంటుందని వ్యాఖ్యానించారు.

## ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా
# చేయాల్సిందే

**జంతర్ మంతర్ వద్ద కాక్రోచ్ జనతా పార్టీ నిరసన..**

**న్యాయం జరిగే వరకు జంతర్ మంతర్ వీడబోమని ప్రకటన**



**న్యూఢిల్లీ, జూన్ 20**
నీట్ పేపర్ లీకేజీకి, విద్యార్థుల మరణాలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధరేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందేనని కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ) మరోసారి డిమాండ్ చేసింది. శనివారం జంతర్ మంతర్ వద్ద భారీ నిరసన చేపట్టింది. 'థాలీ బజావో' పేరిట చేపట్టిన ఈ నిరసన కార్యక్రమానికి సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్, భారీ సంఖ్యలో విద్యార్థులు, మద్దతుదారులు తరలివచ్చారు. పరీక్షలను పారదర్శకంగా నిర్వహించడంలో ప్రభుత్వం విఫలమైందని, అభ్యర్థుల ప్రయోజనాలను కాపాడాలని విద్యార్థులు నినాదాలు చేశారు. సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే పిలుపు మేరకు మద్దతుదారులు ప్లేట్లు, స్పూన్లు తీసుకొచ్చి వాటిని మోగిస్తూ తమ నిరసన తెలిపారు. అయితే ధరేంద్ర ప్రధాన్ రాజీనామా చేసేవరకు తాము జంతర్ మంతర్‌ను వీడబోమని వారు ప్రకటించడంతో వందలాదిగా పోలీసులు ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టారు.


## 9.44 కోట్ల రైతులకు..
# 18,880 కోట్లు

**పీఎం కిసాన్ 23వ విడత నిధుల విడుదల**

**బెంగాల్ నుంచి విడుదల చేసిన ప్రధాని మోదీ**

**కోల్‌కతా, జూన్ 20:**
దేశవ్యాప్తంగా 9.44 కోట్ల మంది రైతులకు ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి (పీఎం-కిసాన్) పథకం నిధులు విడుదలయ్యాయి. బెంగాల్‌లోని హుగ్లీ జిల్లా తారకేశ్వర్‌లో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ.. పీఎం కిసాన్ 23వ విడత కింద మొత్తం రూ.18,880 కోట్లను ఒకేసారి విడుదల చేశారు. 2019లో ప్రారంభమైన ఈ పథకం కింద అర్హులైన రైతులకు ప్రత్యక్ష ప్రయోజన బదిలీ (డీబీటీ) కింద ఏటా మూడు దఫాలుగా రూ.2,000 చొప్పున మొత్తం రూ.6,000 కేంద్ర ప్రభుత్వం అందజేస్తోంది. ఇప్పటివరకు రూ.4.46 లక్షల కోట్లను రైతుల బ్యాంకు ఖాతాల్లో జమచేసింది.

## నాగపూర్ విద్యార్థికి
# అబుదాబి సెంటర్



**నీట్ రీ ఎగ్జామ్ ప్రక్రియలో విచిత్రం**

**సోషల్ మీడియాలో తీవ్ర విమర్శలు**

**సవరించి మళ్లీ హాల్ టికెట్ విడుదల చేసిన ఎన్‌టీఏ.. నేడే నీట్ రీ ఎగ్జామ్**

**న్యూఢిల్లీ, జూన్ 20:**
నీట్ పరీక్ష రాయనున్న మహారాష్ట్రలోని నాగపూర్‌నకు చెందిన ఓ విద్యార్థికి యూఏఈలోని అబుదాబిలో పరీక్షకేంద్రాన్ని కేటాయించటం కలకలం రేపింది. అబ్దుల్లా తాలిబ్ అనే విద్యార్థి పరీక్షకేంద్రం ఎంపికల్లో నాగపూర్, వార్ధా, బండారా నగరాల పేర్లను తన దరఖాస్తులో పేర్కొన్నాడు. అడ్మిట్‌కార్డును డౌన్‌లోడ్ చేసుకున్నప్పుడు.. ఈ మూడింటిలో ఏదీ కాకుండా అబుదాబిలోని ఓ పరీక్షకేంద్రాన్ని కేటాయించటం చూసి దిగ్భ్రాంతి చెందాడు. దీనిపై అబ్దుల్లా తండ్రి డాక్టర్ మహమ్మద్ తాలిబ్.. పరీక్ష నిర్వహిస్తున్న నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) దృష్టికి తీసుకువెళ్లారు. సాంకేతిక తప్పిదంతో ఈ పొరపాటు జరిగిందని ఎన్‌టీఏ అధికారులు అంగీకరించారు. తర్వాత నాగపూర్‌లోనే ఒక కేంద్రాన్ని విద్యార్థికి కేటాయిస్తూ మళ్లీ హాల్ టికెట్ విడుదల చేశారు. అయితే, ఈ అంశం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. పలువురు ఎన్‌టీఏ పనితీరుపై మరోసారి విమర్శలు గుప్పించారు. ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ స్పందిస్తూ.. మన విద్యార్థుల భవిష్యత్తుతో జూదం ఆడటం మానుకోవాలని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. దేశంలో విద్యావ్యవస్థ ధ్వంసమైపోయిందని, ఇది ఒక తరం విద్యార్థుల డబ్బులు, సమయం, మానసిక ప్రశాంతతను దోపిడీ చేయటమేనంటూ నిప్పులు చెరిగారు. మరోవైపు, నీట్ విద్యార్థుల ఆత్మహత్యలు కొనసాగుతున్నాయి. ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్‌కు చెందిన జతిన్ కుమార్ అనే విద్యార్థి ఇంట్లో తన గదిలో ఉరి వేసుకొని ప్రాణాలు తీసుకున్నాడు. ఆదివారం నీట్ రీ ఎగ్జామ్ నేపథ్యంలో ఎన్‌టీఏ శనివారం దేశవ్యాప్తంగా మాక్‌డ్రిల్ నిర్వహించింది. దేశవిదేశాల్లో నిర్వహించే ఈ పరీక్షకు 22.79 లక్షల మంది విద్యార్థులు నమోదు చేసుకున్నారు.

## దేశ విభజన వేళ బెంగాల్‌ను పాక్‌లో
# కలిపేందుకు కాంగ్రెస్ యత్నం



**కోల్‌కతా, జూన్ 20:**
దేశ విభజన సమయంలో కాంగ్రెస్ పార్టీ బెంగాల్ మొత్తాన్ని పాక్‌లో కలిపేందుకు యత్నించిందని ప్రధాని మోదీ ఆరోపించారు. విద్రోహ శక్తుల ముందు ఆ పార్టీ మోకరిల్లిందన్నారు. అయితే కాంగ్రెస్ ఎన్ని కుయుక్తులు పన్నినా బెంగాల్ అనేక కష్టాలకు ఓర్చుకుని, పోరాట స్ఫూర్తితో తన ఉనికిని కాపాడుకుందని చెప్పారు.

## ఐపీవోకి జెప్టో..




**న్యూఢిల్లీ :** క్విక్ కామర్స్ సేవల సంస్థ జెప్టో..స్టాక్ మార్కెట్లోకి అడుగుపెట్టడానికి సిద్ధమవుతున్నది. ఇందుకు సంబంధించి స్టాక్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీకి దరఖాస్తు చేసుకున్నది. వాటాల విక్రయం ద్వారా గరిష‘ంగా రూ.11 వేల కోట్ల నిధులను సమీకరించాలని యోచిస్తున్నది. వచ్చే ఏడాది మార్కెట్లో లిస్ట్ కానున్న అతి పిన్న వయస్సు కలిగిన స్టార్టప్‌లలో ఇది కూడా ఒకటికానున్నది. ఇప్పటికే మార్కెట్లోకి అడుగుపెట్టిన జోమాటో, స్విగ్గీలకు పోటీగా జెప్టో..ఐపీవోకి రాబోతున్నది. 7 బిలియన్ డాలర్ల విలువ కలిగిన జెప్టో..ఈ ఐపీవో ద్వారా 1.8 బిలియన్ డాలర్లు లేదా రూ.16 వేల కోట్ల నిధులు సమీకరించాలని యోచిస్తున్నది. ఈ అక్టోబర్ నెలలో సంస్థ రూ.3,757 కోట్ల నిధులను సమీకరించింది.

## ఐటీఆర్ రిఫండ్ ఆలస్యమా..

### కారణాలు ఇవి కావచ్చు..




**న్యూఢిల్లీ :** మీ ఆదాయ పన్ను (ఐటీ) రిఫండ్ బ్యాంక్ ఖాతాలో ఎప్పుడు జమ అవుతుందా? అని మీరు ఇప్పటికీ వేచి చూస్తున్నారా?.. అసలు ఈ ఏడాది ఇంత సమయం ఎందుకు పడుతున్నది? అని ఆశ్చర్యపోతు న్నారా?.. నిజానికి హై-వాల్యూ రిఫండ్ క్లెయిముల పరిష్కారానికి అదనపు వ్యవస్థీక ృత పరిశీలనలుంటాయి. పైగా సెక్షన్ 143(1) ప్రకారం ఐటీ శాఖకు 2024-25 ఆర్థిక సంవత్సరానికిగాను దాఖలైన ఐటీఆర్‌ల ప్రక్రియ కోసం వచ్చే ఏడాది డిసెంబర్ 31దాకా సమయం ఉన్నది. అలాగే ఐటీ చట్టం 1961లోని సెక్షన్ 245(2) కింద కొన్ని పరిస్థితుల్లో రిఫండ్స్ తిరిగి వెనుకకు వెళ్లిపోతాయి. అయితే దీనికి వ్యవస్థీక ృత కారణాలేమీ పెద్దగా ఉండవు. ట్యాక్స్‌పేయర్స్ ద్వారా జరిగిన తప్పిదాలే ఎక్కువగా కారణమవుతూ ఉంటాయి. కాగా, మీ బ్యాంక్ ఖాతా అప్‌డేట్ అవ్వకపోయినా రిఫండ్స్ ఆలస్యం కావచ్చు. కాబట్టి ఈ-ఫైలింగ్ పోర్టల్‌పై మీ ప్రొఫైల్‌లో సరైన బ్యాంక్ ఖాతా వివరాలనే ఉంచాలి. ఇక ఈ-ఫైలింగ్ వెబ్‌సైట్ పేజీ **https://www.incometax.gov.in/iec/foporta**ని సందర్శించి కూడా రిఫండ్ స్టేటస్‌ను తెలుసుకోవచ్చు.

**గుర్తుంచుకోండి..**

మీ ఐటీఆర్ పరిశీలన 30 రోజుల్లోగా పూర్తికాకపోతే దాన్ని ఇన్‌వాలిడ్‌గా పరిగణిస్తారన్న విషయం మీకు తెలుసా? ప్రస్తుత సీబీడీటీ నిబంధనల ప్రకారం ఆన్‌లైన్‌లో ఐటీ రిటర్న్ దాఖలైతే 30 రోజుల్లోగా వెరిఫై కావాల్సిందే. ఇది ఇ-వెరిఫికేషన్ ద్వారానైనా లేదా బెంగళూరు సీపీసీకి సంతకమైన వెరిఫై ఐటీఆర్ భౌతిక కాపీని పంపడం ద్వారానైనా అవుతుంది. ఇక చాలామంది రిటర్న్‌ను దాఖలు చేసినా సకాలంలో దాన్ని వెరిఫై చేయడం మర్చిపోతారు. దాంతో డెడ్‌లైన్ ముగిసి అది పనికిరాకుండా పోతుంది.

## లక్ష దాటిన పెట్రోల్ పంపులు




న్యూఢిల్లీ, డిసెంబర్ 25: దేశవ్యాప్తంగా పెట్రోల్ బంకులు లక్ష దాటిపోయాయి. ప్రభుత్వరంగ సంస్థలు అత్యధికంగా పెట్రోల్ బంకులను ఏర్పాటు చేయడానికి మొగ్గుచూపడంతో ఈ ఏడాది ఇప్పటి వరకు దేశీయంగా 1,00,266 పెట్రోల్ బంకులు అందుబాటులోకి వచ్చాయి. వీటిలో 90 శాతం ప్రభుత్వరంగ సంస్థలైన ఐవోసీ, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్ ఆధ్వర్యంలో నడుస్తున్న బంకులు ఉండటం విశేషం. అలాగే ప్రపంచ దేశాల్లో మూడో అతిపెద్ద దేశంగా భారత్ నిలిచినట్లు పెట్రోలియం ప్లానింగ్ అండ్ అనాలసిస్ సెల్ తాజాగా వెల్లడించింది. తొలి స్థానంలో అమెరికా ఉండగా, ఆ తర్వాత స్థానంలో చైనా నిలిచింది. వీటితోపాటు ప్రైవేట్ సంస్థలైన నయారా, రిలయన్స్-బీపీ, షెల్‌లు సంయుక్తంగా 10 వేల వరకు నిర్వహిస్తున్నాయి. 2015లో దేశవ్యాప్తంగా 50 వేల స్థాయిలో ఉన్న పెట్రోల్ బంక్‌లు కేవలం పదేండ్లలో రెండింతలు పెరుగడం విశేషం.

# ఏఈ ‘శ్రీనివాసుడి’

# సిత్రాలెన్నో..?!

- టీఎస్ఎన్ పీడీసీఎల్ లో విధులు నిర్వర్తిస్తూ..
- భూకబ్జాలు, సెంటిల్ మెంట్లలో తలదూరుస్తూ
- ఇది చాలదన్నట్లు తోడుగా అధికార పార్టీ లీడరు, మరో ఎస్సై
- ఇంకా ఓ అడుగు ముందుకేసి సోదరులను తోడేసుకొని కబ్జాల దందా
- పుట్టిన చోటే ఏఈగా పని చేస్తూ పనికిమాలిన పనులు
- మందమర్రిలో ఏఈ శ్రీనివాసుడి భూ జంతర్ మంతర్ మాయలు



**మంచిర్యాల,జూన్ 20,(మన సమాజం) :** **తెలంగాణా రాష్ట్ర ఎన్పీ డీసీఎల్ లో ఏఈ ముసుగు మాటున భూకబ్జాలు, భూముల సెంటిల్ మెంట్లు చేస్తున్నాడు ఆ అధికారి. పుట్టిన చోటే ప్రభుత్వ కొలువు దక్కించుకొని భూములు కొల్ల గొట్టడం, ‘బొంకిం’చి బోల్తా కొట్టించడం రివాజుగా మార్చుకున్నాడు. ఏ పార్టీ అధికారంలోకి వస్తే.. ఆ పార్టీ నాయకుల పంచన చేరి నయవంచక కార్యక్రమాలు వెలగ బెడుతున్నాడు. అది చాలదన్నట్లు ఒక ఎస్సైని, సోదరులను తోడేసుకొని భూముల కబ్జాలు, సెటిల్ మెంట్లు చేపడుతున్నాడు. జిల్లా కేంద్రానికి సమీపంలో ఉన్న రియల్ ఎస్టేట్ మాఫియాను సమాంతరంగా నడిపిస్తున్నాడనే ఆరోపణలు ఈయన పై పెద్ద ఎత్తున దుమారం రేపుతున్నాయి. ఎక్కడికి కదలకుండా మెదలకుండా ఒకే(ఇంటి) పట్టున ఉంటూ ప్రభుత్వ ఉద్యోగాన్ని మూడు ప్లాట్లు, ఆరు కబ్జాలు అన్నట్లు నెట్టుకొస్తున్న ఆ ఏఈ పనికిమాలిన, గలీజు భూ దందాల వ్యవహారాల్లోకి వెళితే....**

మంచిర్యాల జిల్లా మందమర్రి టీఎస్ఎన్ పీడీసీఎల్ లో విధులు నిర్వర్తిస్తున్నాడు ఏఈ శ్రీనివాసుడు. ఇదే మందమర్రి సొంత ఊరు కావడంతో.. తనకు ఎదురే లేదన్నట్లుగా భూ కబ్జాలు, భూముల సెటిల్ మెంట్లకు తెగ బడుతున్నాడు. ఎక్కడికక్కడ సత్సంబంధాలు ఏర్పాటు చేసుకొని బాహాటంగానే భూముల కబ్జాలు చేపడుతున్నాడు. సెటిల్ మెంట్లు కూడా చేస్తున్నాడని సమాచారం. దాదాపు పది సంవత్సరాలకు పైబడి మందమర్రి టీఎస్ఎన్ పీడీసీఎల్ లో విధులు నిర్వర్తిస్తుండడంతో అతగాడికి ఎదురే లేకుండా పోతోంది. పేరుకు ప్రభుత్వ పోస్ట్ అడ్డం పెట్టుకొని పనికి మాలిన యవ్వారాలే చేపడుతున్నాడనే ఆరోపణలు కోకొల్లలుగా ఉన్నాయి. తను చెప్పింది వినని పక్షంలో సామాన్య ప్రజలను భయభ్రాంతులకు గురి చేయడానికి సైతం సిద్ధపడుతున్నాడని విశ్వసనీయ సమాచారం. ఈ మధ్య కాలంలోనైతే ఈ శ్రీనివాసుడు మరింతగా పేట్రేగిపోతున్నాడని తెలుస్తోంది.

**అధికార పార్టీ నాయకులు, ఓ ఎస్సై..!**

టీఎస్ఎన్ పీడీసీఎల్ సార్ కు పెద్ద బలగమే ఉన్నట్లు సమాచారం. అధికార రాజకీయ పార్టీ నాయకులు, ఒక ఎస్సై స్థాయి పోలీసు అధికారితో చెట్టాపట్టాలేసుకుని తిరిగేంత చనువు ఉన్నట్లు చెబుతున్నారు. ఈ అక్రమాల చనువు తాలుకూ స్నేహబంధం ముసుగులో భూ దందాలు సాగిస్తుండడం గమనార్హం. అధికారం ఎ పార్టీలో ఉంటే వెంటనే ఆ పార్టీ గొడుగు మార్చడం తన అభిమతంగా పెట్టుకున్నట్లు కనిపిస్తోంది. కనుకనే ఎప్పటికప్పుడు పార్టీలు మారుతూ తన భూ కబ్జాలు సెటిల్ మెంట్లకు సదరు నాయకులను వాడుతుంటుండడం ఇతగాడి నైజంగా చెప్పుకోవచ్చు. అదేవిధంగా ఒక ఎస్సై స్థాయి పోలీస్ అధికారిని కూడా ట్రాప్ చేసి తన అసాంఘిక, అక్రమాల చేష్టలకు మద్దతు కూడగట్టుకుంటున్నారని సమాచారం. ఇలా పోలీస్, అధికార బలం ఆసరా చేసుకుని విచ్చలవిడిగా రెచ్చిపోయి భూ కబ్జాలు, సెటిల్ మెంట్లు మూడు స్థంభాలు, ఆరు ట్రాన్స్ ఫార్మర్లుగా సాగిస్తున్నాడు.

### సోదరులను సైతం తోడేసుకొని..!

ఈ బొంకూరి నిర్వాకాలకు అతని సోదరులను తోడేసుకోవడం విశేషం. ఎక్కడికక్కడ చేపట్టే వెకిలి అక్రమ చేష్టలకు వీరిని అడ్డం పెట్టుకొని భూ దందాలు సాగిస్తున్నాడు ఈ టీఎస్ఎన్ పీడీసీఎల్ అధికారి శ్రీనివాసుడు. ప్రభుత్వ శాఖలో కీలకమైన పోస్ట్.. అది కూడా తన సొంత ఊరిలో కావడం వడ్డీ కాసుల వాడి కంటే ఈయనకే ఎక్కువ ‘ఆముదాని’ వచ్చేలా చేస్తున్నదనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. దీనికి తోడు పట్టణ ప్రముఖులు కూడా అంతో ఇంతో సహకారం ఇస్తుండడం ఏఈ సాబుకు ఎనలేని క్రేజ్ తెచ్చి పెడుతోంది. ఈ నేపథ్యంలో అటు రాజకీయ, ఇటు పోలీస్ సపోర్ట్ కూడగట్టుకుని ఇష్టారాజ్యంగా భూ దందాలు చేపడుతున్నాడనే విమర్శలు వినిపిస్తున్నాయి. శాఖ ఉన్నతాధికారులు కాస్త ఈయన నిర్వాకాల పై సంస్థాగతంగా సమగ్ర విచారణ జరిపి, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న ఈ బొంకూరి పై తగు చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

# డిజిటలైజేషన్‌లో యూటర్న్!..

### ఆన్‌లైన్‌లో కొత్త ఖాతాల విషయంలో బ్యాంకర్లు అప్రమత్తం




న్యూఢిల్లీ : కొత్త ఖాతాల విషయంలో బ్యాంకర్లు డిజిటలైజేషన్ కంటే సంప్రదాయ పద్ధతులకే మొగ్గు చూపుతున్నారు. ఆన్‌లైన్ ద్వారా బ్యాంక్ ఖాతాలను తెరువాలని కోరుకునే కస్టమర్ల కోసం బడా బ్యాంకు లు ఇప్పుడు భౌతిక పరిశీలనలకే ఆసక్తి కనబరుస్తున్నాయి మరి. మ్యూల్ అకౌంట్లు, మోసాల నేపథ్యంలో కస్టమర్ల ఇంటికే రిలేషన్‌షిప్ మేనేజర్లు వెళ్లి పనిని పూర్తిచేస్తున్నారు. లేకపోతే కస్టమర్లను సమీప బ్యాంక్ శాఖలకు రావాలని బ్యాంక్ వర్గాలు కోరుతున్నాయి.

**బడా బ్యాంకుల్లో..**

ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఎస్బీఐ, బ్యాంక్ ఆఫ్ బరోడా, బ్యాంక్ ఆఫ్ ఇండియాలు తమ ఎండ్-టు-ఎండ్ డిజిటల్ ఆన్‌బోర్డింగ్ వ్యవస్థల్ని పక్కనపెట్టినట్టు తెలుస్తున్నది. ఐసీఐసీఐ బ్యాంక్ తమ ఇన్‌స్టా-అకౌంట్ ఓపెనింగ్ సర్వీస్‌ను ఆపేసిందని సమాచారం. కేవలం సాలరీ ఖాతాలకే డిజిటల్ ప్రక్రియను వినియోగిస్తున్నట్టు చెప్తున్నారు. మిగతా ఖాతాలను ఆశించే కస్టమర్లు డాక్యుమెంట్స్ సమర్పణకు సమీప బ్యాంక్ శాఖకు వెళ్లాలని బ్యాంక్ అధికారులు సూచిస్తున్నారు. దరఖాస్తుల పరిశీలనకు కస్టమర్ల ఇండ్లకే బ్యాంక్ అధికారులూ వెళ్తున్నారని బ్యాంక్ వర్గాలు చెప్తున్నాయి. పైగా పెరుగుతున్న మోసాలకు నో యువర్ కస్టమర్ (కేవైసీ) నిబంధనలను పాటించకపోవడమేనంటూ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) బ్యాంకులపై జరిమానాలనూ వేస్తున్న విషయం తెలిసిందే. దీంతో ఈ ఫైన్ల నుంచీ తప్పించుకున్నట్టు అవుతుందని చాలా బ్యాంకులు భౌతిక పరిశీలనలకే జై కొడుతున్నాయి.

**మ్యూల్ ఖాతాల సెగ**

అమాయక ఖాతాదారులను ఏమార్చి నేరగాళ్లు.. తమ అక్రమ కార్యకలాపాల నుంచి ఆర్జించిన సొమ్మును పొందడానికి, బదిలీ చేయడానికి వారి బ్యాంక్ ఖాతాలను వాడుకుంటూ ఉంటారు. మనకు తెలియకుండానే మోసపూరితంగా మన డాక్యుమెంట్లను వాడుకుని బ్యాంకుల్లో మన పేరిట ఖాతాలనూ తెరుస్తారు. వీటినే మ్యూల్ అకౌంట్స్ అంటారు. అయితే ఈ వ్యవహారాన్ని బ్యాంకులు గుర్తిస్తే సదరు ఖాతాలు మూతబడిపోతాయి. అంతేగాక దీంతో ప్రమేయంలేని అమాయకులు సమస్యల్లో పడుతారు. భవిష్యత్తులో వారికి బ్యాంకింగ్ లావాదేవీలు కష్టతరంగా మారుతాయి. ఇక ఇటీవలికాలంలో ఈ మ్యూల్ అకౌంట్స్ పెరిగిపోతున్నాయి.

గత ఏడాది పెద్దపెద్ద బ్యాంకుల్లో మోసపూరిత నగదు లావాదేవీలు భారీగానే జరిగినట్టు గుర్తించారు. అందుకే ఆన్‌లైన్ అకౌంట్ ఆన్‌బోర్డింగ్ సర్వీసు నిబంధనల్ని కఠినతరం చేస్తున్నామని బ్యాంక్ సిబ్బంది అంటున్నారు. డిజిటల్ బ్యాంకింగ్ మార్గాల ద్వారా నకిలీ డాక్యుమెంట్లతో ఖాతాలు తెరుస్తున్న వైనాన్ని అడ్డుకునే దిశగా బ్యాంకులు వెళ్తున్నాయని, అందుకే కస్టమర్లను నేరుగా సంప్రదించాకే ఖాతాలను తెరుస్తున్నాయని ఓ ఫ్రాడ్ డిటెక్షన్ స్టార్టప్ వ్యవస్థాపకుడు తెలిపారు.

# వర్షాలకు సిద్ధం కావాలి

**- పిడుగులతో భారీ వర్షాల హెచ్చరిక - పలు జిల్లాలకు అప్రమత్త సూచనలు- రాత్రి వేళల్లో ఎక్కువ ప్రభావం**



**హైదరాబాద్, జూన్ 20**
తెలుగు రాష్ట్రాల్లో వాతావరణ పరిస్థితులు వేగంగా మారుతున్నాయి. ఇటీవల రుతుపవనాలు ప్రవేశించినప్పటికీ ఆశించిన స్థాయిలో వర్షాలు నమోదు కాలేదు. అయితే నేటి నుంచి పరిస్థితుల్లో గణనీయమైన మార్పు కనిపించనుందని వాతావరణ శాఖ వెల్లడించింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులు, పిడుగులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. దీంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ఆంధ్రప్రదేశ్‌లో ఉత్తరాంధ్ర, దక్షిణ కోస్తా, రాయలసీమ ప్రాంతాలపై వర్షాల ప్రభావం అధికంగా ఉండనుంది. శ్రీకాకుళం, విజయనగరం, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, విశాఖపట్నం జిల్లాలతో పాటు గుంటూరు, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముందని అధికారులు తెలిపారు. పిడుగులు పడే ప్రమాదం కూడా ఉండటంతో రైతులు, కూలీలు, బహిరంగ ప్రదేశాల్లో పనిచేసే వారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రాయలసీమలోని కడప, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో కూడా వర్షాల తీవ్రత ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. కొన్నిచోట్ల స్వల్ప వ్యవధిలోనే అధిక వర్షపాతం నమోదయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయని వాతావరణ నిపుణులు పేర్కొంటున్నారు. లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచిపోయే అవకాశం ఉండటంతో స్థానిక యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని సూచనలు జారీ అయ్యాయి. తెలంగాణలో కూడా నేటి నుంచి వర్షాల ప్రభావం పెరగనుంది. ముఖ్యంగా మధ్య, దక్షిణ తెలంగాణ జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ తెలిపింది. సంగారెడ్డి, వికారాబాద్, రంగారెడ్డి, మెదక్, సిద్దిపేట్, మహబూబ్‌నగర్, వనపర్తి, నాగర్‌కర్నూల్, నారాయణపేట జిల్లాల్లో వర్షాలు బలంగా ఉండే అవకాశం ఉందని అంచనా వేసింది.నల్గొండ, యాదాద్రి భువనగిరి, జనగాం, కామారెడ్డి జిల్లాల్లో సాయంత్రం నుంచి అర్ధరాత్రి వరకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు. ఈ సమయంలో పిడుగులు పడే ప్రమాదం కూడా అధికంగా ఉండటంతో ప్రజలు చెట్ల కింద నిలబడకుండా, బహిరంగ ప్రదేశాల్లో సంచరించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. విద్యుత్ స్తంభాలు, నీటి నిల్వ ప్రాంతాల వద్ద కూడా అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. హైదరాబాద్ నగరంలో పగటి వేళల్లో ఎండ తీవ్రత కనిపించినప్పటికీ రాత్రి సమయంలో వాతావరణం ఒక్కసారిగా మారే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. ఉరుములు, మెరుపులు, పిడుగులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున నగరవాసులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాత్రి వేళల్లో అనవసర ప్రయాణాలు తగ్గించుకోవడం, వర్షాల సమయంలో సురక్షిత ప్రాంతాల్లో ఉండడం మంచిదని అధికారులు పేర్కొన్నారు. దీంతో రానున్న రెండు రోజుల పాటు తెలుగు రాష్ట్రాల్లో వర్షాల ప్రభావం ప్రధానంగా కనిపించే అవకాశం ఉంది.

# స్మార్ట్ ఫోన్లకు స్వస్తి పలికిన గ్రామస్తులు

**జన్మలో వాడబోమంటూ రోడ్డుపై వేసి ధ్వంసం**
**వ్యక్తిగత, సామాజిక జీవితాలను దెబ్బతీస్తున్న మొబైల్స్**
**వ్యసనం నుండి విముక్తి కోసం వినూత్న నిర్ణయం**
**పాత తరం సాధారణ ఫోన్ల వైపే మొగ్గు చూపుతున్న ప్రజలు**




**జైపూర్, జూన్ 20**
ఆధునిక ప్రపంచంలో మనిషి జీవితంలో భాగమైన స్మార్ట్ ఫోన్ తమ వ్యక్తిగత జీవితాన్ని తప్పుడు దారిలో నడిపించడమే కాక, సామాజిక జీవనాన్ని కూడా తీవ్రంగా దెబ్బతీస్తున్నదని రాజస్థాన్‌లోని ఒక గ్రామానికి చెందిన పౌరులు గ్రహించారు. సాంకేతిక పరిజ్ఞానం పరిధి దాటితే ఎంత ప్రమాదకరమో తెలుసుకున్న ఆ గ్రామస్తులంతా ఇకపై స్మార్ట్ ఫోన్ వద్దు.. పాత తరం సాధారణ ఫోనే ముద్దు అంటూ ఒక కీలక నిర్ణయానికి వచ్చారు. నిత్యం ఏదో ఒక ఆకర్షణతో మనుషులను బానిసలుగా మారుస్తున్న ఈ పరికరాలకు శాశ్వతంగా దూరంగా ఉండాలని ఆ ప్రాంత ప్రజలంతా ఏకగ్రీవంగా తీర్మానించుకు న్నారు. ఈ క్రమంలోనే జన్మలో మళ్లీ స్మార్ట్ ఫోన్ జోలికి వెళ్లకూడదని గట్టిగా నిర్ణయించుకున్న గ్రామస్తులంతా తమ వద్ద ఉన్న ఖరీదైన ఫోన్లను తీసుకువచ్చి రోడ్డుపై ఒకే చోట కుప్పగా వేశారు. ఆ తర్వాత వాటన్నింటినీ రాళ్లతో కొట్టి, పూర్తిగా విరగ్గొట్టి తమ నిరసనను, పట్టుదలను చాటుకున్నారు. ఆధునిక కాలంలో ప్రతి ఒక్కరూ ఫోన్లకే అతుక్కుపోతున్న తరుణంలో, ఒక గ్రామం మొత్తం కలిసి వాటిని ధ్వంసం చేయడం అందరినీ ఆశ్చర్యపరిచింది. దీనికి సంబంధించిన దృశ్యాలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాలలో విపరీతంగా ప్రచారమవుతూ దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున చర్చకు దారితీశాయి. ఈ సందర్భంగా ఆ గ్రామానికి చెందిన ఒక యువకుడు మాట్లాడుతూ.. ప్రస్తుత రోజుల్లో స్మార్ట్ ఫోన్ల వ్యసనం అనేది ప్రమాదకరమైన మత్తుపదార్థాల వ్యసనం కన్నా తక్కువేమీ కాదని ఆవేదన వ్యక్తం చేశాడు. ఉదయం లేచింది మొదలు రాత్రి పడుకునే వరకు ప్రతి ఒక్కరూ దాన్నే చూస్తూ సమయాన్ని వృథా చేసుకుంటున్నారని తెలిపాడు. ఇంటర్నెట్ మాయలో పడి యువత తమ భవిష్యత్తును పాడుచేసుకుంటున్నారని, ఈ అలవాటు నుండి విముక్తి పొంది సాధారణ జీవితాన్ని గడపడానికే తామంతా ఈ నిర్ణయం తీసుకున్నట్లు సదరు యువకుడు స్పష్టం చేశాడు. గ్రామ పెద్దలు కూడా ఈ విషయంపై స్పందిస్తూ.. స్మార్ట్‌ఫోన్‌ల వాడకం తమ గ్రామంలో ఒక పెద్ద అంటువ్యాధిలా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇంట్లో నలుగురు ఉన్నా ఎవరికి వారే ఫోన్లకే పరిమితమై, కనీసం ఒకరినొకరు పలకరించుకోవడం కూడా మానేశారని వారు గుర్తుచేశారు. ఈ సాంకేతికత వల్ల మనుషుల మధ్య బంధాలు, ఆత్మీయతలు పూర్తిగా కనుమరుగైపోతున్నాయని, సమాజంలో ఒంటరితనం పెరుగుతోందని వారు అభిప్రాయ పడ్డారు. పండుగలు, శుభకార్యాలలో సైతం ఒకరితో ఒకరు మాట్లాడకుండా మొబైల్స్ లోనే మునిగిపోవడం కలచివేసిందని అన్నారు. చిన్న పిల్లలు సైతం నిత్యం ఈ ఫోన్లతోనే గడుపుతూ చదువుకు, ఆటపాటలకు దూరమవుతున్నారని గ్రామ పెద్దలు పేర్కొన్నారు. అందుకే గ్రామంలోని ప్రతి ఒక్కరి బాగు కోసం, రాబోయే తరాల భవిష్యత్తు కోసం ఇక నుంచి పాత తరం సాధారణ ఫోన్లను మాత్రమే వాడుతామని గ్రామస్తులు స్పష్టం చేశారు. కేవలం సమాచార మార్పిడికి, మాట్లాడుకోవడానికి మాత్రమే ఫోన్లను పరిమితం చేస్తామని, ఇంటర్నెట్ లేని సాధారణ మొబైల్స్ వల్ల ఎలాంటి మానసిక ఒత్తిడి ఉండదని వారు భావిస్తున్నారు. ఈ వినూత్న నిర్ణయం ఇతర గ్రామాలకు కూడా ఆదర్శంగా నిలుస్తుందని సామాజిక విశ్లేషకులు భావిస్తున్నారు.

# భారత్ వైపు 40 ఇంధన నౌకలు

**హోర్ముజ్ జలసంధి దాటడానికి సిద్ధం.. యూరియా, డీఏపీ నౌకలు కూడా రెడీ**

**న్యూఢిల్లీ, జూన్ 20:**
కొంతకాలంగా మూసుకుపోయిన హోర్ముజ్ జలసంధి నుంచి ఎట్టకేలకు నౌకల రాకపోకలకు మార్గం సుగమమైంది. పర్షియన్ గల్ఫ్ నుంచి ఆ జలసంధి దాటి భారత్‌కు రావడానికి 40 నౌకలు సిద్ధంగా ఉన్నాయి. ఎప్పటి నుంచో ఎదురుచూస్తున్న ఆ రవాణా నౌకల్లో భారత్‌కు వెంటనే కావాల్సినది.. కోట్లాది కుటుంబాల వంటకు అవసరమైన లిక్విఫైడ్ పెట్రోలియం గ్యాస్ (ఎల్పీజీ). హోర్ముజ్ జలసంధి దిగ్బంధనంతో భారత్ ఎల్పీజీ దిగుమతిపై భారీ ప్రభావం పడింది. యుద్ధం ముందునాటి కంటే 51శాతం దిగువకు దిగుమతులు పడిపోయాయి. క్రూడ్ ఆయిల్ దిగుమతిని ఎలాగోలా సర్దుబాటు చేసుకున్నా, ఎల్పీజీ విషయంలో మాత్రం గట్టిదెబ్బ పడింది. ఎందుకంటే ఈ వాణిజ్యం ప్రత్యేకమైన ట్యాంకర్లు, పరిమిత సంఖ్యలోని సరఫరాదార్లపై ఆధారపడి ఉంటుంది. నౌకల్లోకి ఎల్పీజీ నింపడం ఆలస్యమైనా, సాధ్యం కాకపోయినా మన దేశానికి చాలా తక్కువ సంఖ్యలో మాత్రమే ప్రత్యామ్నాయాలు అందుబాటులో ఉన్నాయి. గల్ఫ్‌లోని ఎగుమతి టర్మినళ్లు సాధారణ పరిస్థితులకు వస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో ద్రవీకృత సహజవాయువు (ఎల్ఎన్‌జీ) ఎగుమతులు కూడా త్వరలో కోలుకునే అవకాశం ఉంది. మరోవైపు, హోర్ముజ్ జలసంధిని దాటడానికి 80 మిలియన్ బ్యారెళ్ల ముడి చమురుతో ఇంధన రవాణా నౌకలు సిద్ధంగా ఉన్నాయని బ్లూమ్‌బెర్గ్ తాజాగా పేర్కొంది. 40 ట్యాంకర్లలో ఆ ముడి చమురు నింపి ఉందని, వాటిలో 21 నౌకలు ఆసియాకు రానున్నాయని వెల్లడించింది. ఈ సీజన్‌కు చాలినంత ఎరువులు సిద్ధంగా ఉన్నాయని కేంద్రం ఇటీవల చెప్పింది. జూన్ 14 నాటికి 196.65 లక్షల టన్నుల ఎరువులు నిల్వ ఉన్నాయని తెలిపింది. హోర్ముజ్ జలసంధి నుంచి 12 నౌకలు ఎరువుల రవాణాకు సిద్ధంగా ఉన్నాయని వెల్లడించింది. వీటిలో 3.3 లక్షల టన్నుల యూరియా, 2.57 లక్షల టన్నుల డీఏపీ ఉందని పేర్కొంది. మార్చి 1నుంచి భారతీయ కంపెనీలు 50 లక్షల టన్నుల ఎరువులు దిగుమతి చేసుకోవడానికి ఒప్పందం చేసుకున్నాయని, ఇప్పటికే 21.95 లక్షల టన్నుల యూరియా, 4.18 లక్షల డీఏపీ దేశానికి చేరుకుందని వెల్లడించింది.

# ఇరాన్ ఒప్పందానికి ట్రంప్ మద్దతు

**యుద్ధ ఉద్రిక్తతలకు తాత్కాలిక విరామం**
**ఆంక్షల సడలింపుతో కొత్త ఆశలు**
**ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ఊరట**



**వాషింగ్టన్, జూన్ 20**
పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ వాతావరణానికి తాత్కాలికంగా ముగింపు పలికే లక్ష్యంతో ఇరాన్‌తో కుదిరిన అవగాహన ఒప్పందాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సమర్థించారు. ఈ ఒప్పందం వల్ల ప్రాంతీయ శాంతి నెలకొనడంతో పాటు ప్రపంచ ఆర్థిక వ్యవస్థ స్థిరపడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఇరాన్ ప్రతినిధులు చర్చల్లో ఎంతో నైపుణ్యంతో వ్యవహరిస్తారని, వారు గొప్ప చరిత్ర, సంస్కృతి కలిగిన ప్రజలని ప్రశంసించారు. ఇరాన్‌తో ఒప్పందం కుదుర్చుకోవడం ద్వారా అమెరికా వెనక్కి తగ్గిందన్న విమర్శలను ట్రంప్ తీవ్రంగా ఖండించారు. ఈ ఒప్పందం ప్రపంచ మార్కెట్లకు ఊరటనిచ్చిందని, ముడి చమురు ధరల పెరుగుదలకు అడ్డుకట్ట వేసిందని పేర్కొన్నారు. యుద్ధ పరిస్థితులు కొనసాగి ఉంటే ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై మరింత భారం పడేదని ఆయన అన్నారు.ఇరు దేశాల మధ్య కుదిరిన పద్నాలుగు అంశాల తాత్కాలిక అవగాహన ప్రకారం పశ్చిమాసియాలో అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధిని మళ్లీ వాణిజ్య రవాణాకు అనుకూలంగా తెరవనున్నారు. గత కొంతకాలంగా కొనసాగుతున్న సైనిక దాడులు, క్షిపణి ఘటనల కారణంగా ఏర్పడిన ఉద్రిక్తతలను తగ్గించేందుకు ఈ చర్యలు దోహదపడనున్నాయి. దీనివల్ల అంతర్జాతీయ వాణిజ్యానికి కూడా ఊరట లభించే అవకాశం ఉంది. ఈ ఒప్పందంలో భాగంగా ఇరాన్‌పై అమలులో ఉన్న కొన్ని ఆర్థిక ఆంక్షలను అమెరికా సడలించేందుకు అంగీకరించింది. దీంతో ఇరాన్ తన చమురును ప్రపంచ దేశాలకు విక్రయించే అవకాశాన్ని పొందనుంది. ప్రతిగా ఇరాన్ తన వద్ద ఉన్న యురేనియం నిల్వలను అంతర్జాతీయ పర్యవేక్షణలో తగ్గించుకోవడానికి అంగీకరించింది. అణు కార్యక్రమాలు, ప్రాంతీయ భద్రత వంటి కీలక అంశాలపై రాబోయే రోజుల్లో మరిన్ని చర్చలు జరగనున్నాయి.అయితే ఇరాన్ పట్ల తమ ప్రభుత్వం ఎప్పుడూ బలహీన వైఖరి అవలంబించబోదని ట్రంప్ స్పష్టం చేశారు. గతంలో ఇరాన్‌కు చెందిన ప్రముఖ సైనికాధికారి ఖాసీం సొలేమనీపై చేపట్టిన చర్యలను ఈ సందర్భంగా గుర్తుచేశారు. ప్రస్తుత ఒప్పందాన్ని ఇరాన్ దుర్వినియోగం చేసినా లేదా నిబంధనలను ఉల్లంఘించినా వెంటనే రద్దు చేసి కఠిన చర్యలు చేపడతామని హెచ్చరించారు. ఈ ఒప్పందం వల్ల ఇజ్రాయెల్ భద్రతకు భరోసా లభించడంతో పాటు ప్రపంచం మరో ఆర్థిక మాంద్యంలోకి వెళ్లకుండా కాపాడగలదని అమెరికా ప్రభుత్వం భావిస్తోంది. మరోవైపు యుద్ధాల వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలకు, ఆంక్షలతో ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ఇరాన్ ప్రజలకు ఈ అవగాహన కొత్త ఆశలను కలిగిస్తోందని అంతర్జాతీయ రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. దీంతో పశ్చిమాసియాలో శాంతి స్థాపనకు ఇది కీలక అడుగుగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# ముగిసిన మౌగ్లీ యువతి జీవన ప్రయాణం

**అనారోగ్యంతో తుది శ్వాస**
**అడవి నుంచి సమాజంలోకి అడుగులు**
**ఎందరికో స్ఫూర్తిగా నిలిచిన జీవితం**



**లక్నో, జూన్ 20**
ఉత్తరప్రదేశ్‌లో దశాబ్దం క్రితం అడవిలో గుర్తింపబడి దేశవ్యాప్తంగా సంచలనంగా మారిన 'మౌగ్లీ యువతి' ఎహ్‌సాస్ జీవన ప్రయాణం విషాదాంతంగా ముగిసింది. ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్‌కు సంబంధించిన తీవ్ర ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆమె చికిత్స పొందుతూ కన్నుమూసింది. అడవిలో పెరిగిన బాలికగా గుర్తింపు పొందిన ఎహ్‌సాస్ కథ అప్పట్లో దేశవ్యాప్తంగా చర్చనీయాంశమై, మానవ సంకల్పానికి ప్రతీకగా నిలిచింది. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఎహ్‌సాస్‌ను లక్నోలోని వైద్యశాలలో చేర్పించారు. చికిత్స అనంతరం ఆరోగ్యం కొంత మెరుగుపడటంతో ఇంటికి పంపించినప్పటికీ, కొన్ని రోజులకే పరిస్థితి మళ్లీ విషమించింది. వెంటనే తిరిగి వైద్యశాలకు తరలించినా ప్రాణాలను కాపాడలేకపోయారు. ఊపిరితిత్తుల వ్యాధి కారణంగా రక్తంలో తీవ్రమైన ఇన్ఫెక్షన్ వ్యాపించడంతో ఆమె మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు.ఎహ్‌సాస్‌ను 2017 సంవత్సరంలో ఉత్తరప్రదేశ్‌లోని కతర్నియాఘాట్ అటవీ ప్రాంతంలో అధికారులు గుర్తించారు. అప్పట్లో ఆమె మానవ సమాజానికి పూర్తిగా దూరంగా జీవిస్తూ కనిపించింది. నాలుగు కాళ్లపై నడవడం, బట్టలు ధరించడానికి నిరాకరించడం, మనుషులను చూసి భయపడటం వంటి లక్షణాలతో ఆమె ప్రవర్తన అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. దీంతో ప్రముఖ సాహిత్య కథలోని మౌగ్లీ పాత్రను పోలుస్తూ ఆమెకు 'మౌగ్లీ యువతి' అనే పేరు వచ్చింది. అడవిలో దొరికిన అనంతరం ఆమెను బాలల సంక్షేమ సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక సంరక్షణ కేంద్రానికి తరలించారు. అక్కడ వైద్య పరీక్షలు నిర్వహించగా మెదడు అభివృద్ధి పూర్తిగా జరగలేదని, మేధో వైకల్యంతో పాటు ఇతర ఆరోగ్య సమస్యలు ఉన్నట్లు తేలింది. అయినప్పటికీ ప్రత్యేక సంరక్షణ, శిక్షణ, వైద్య చికిత్సలతో ఆమెలో గణనీయమైన మార్పు కనిపించింది.కాలక్రమేణా ఎహ్‌సాస్ బట్టలు ధరించడం, చుట్టుపక్కల వారిని గుర్తించడం, సామాజిక జీవనానికి అలవాటుపడటం వంటి అనేక విషయాలు నేర్చుకుంది. సంరక్షణ కేంద్రంలోని సిబ్బందితో ఆప్యాయ బంధం ఏర్పరుచుకుంది. ముఖ్యంగా ఆమెను చూసుకున్న రాణి అనే సంరక్షకురాలిని 'అమ్మా' అని పిలుస్తూ ప్రత్యేక అనుబంధాన్ని పెంచుకుంది. ఎప్పటికైనా ఆమె పూర్తిగా కోలుకుంటుందనే ఆశతో అందరూ ఎదురుచూశారు. అడవిలో ఒంటరి జీవితం నుంచి సమాజంలోకి వచ్చి ఎన్నో సవాళ్లను అధిగమించిన ఎహ్‌సాస్ జీవితం ఎందరికో స్ఫూర్తిగా నిలిచింది.

# సాంస్కృతిక వారసత్వాన్ని ప్రతిబింబిస్తుంది



పురాణ రహస్యాలు, దివ్యశక్తుల మహిమలు, సాహసభరితమైన అంశాల కలయికతో శుక్రవారం విడుదలైన 'నాగబంధం' ట్రైలర్ విజువల్ ఫీస్ట్‌లా సాగింది. విరాట్‌కర్ణ కథానాయకుడిగా అభిషేక్ నామా దర్శకత్వంలో రూపొందుతున్న 'నాగబంధం-ది సీక్రెట్ ట్రెజర్' ట్రైలర్‌ను శుక్రవారం హైదరాబాద్‌లో విడుదల చేశారు.


శతాబ్దాల నాటి రహస్యం చుట్టూ నడిచిన ఈ కథలో అనంత పద్మనాభ స్వామి ఆలయంలో భద్రపరచబడిన పవిత్రమైన బ్రహ్మకమలం కీలకమైన అంశంగా కనిపించింది. తరాలుగా రక్షింపబడుతున్న బ్రహ్మ కమలంను స్వాధీనం చేసుకోవాలనే దుష్టశక్తుల పన్నాగాలతో ట్రైలర్ ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది. శివుడి ఆవిర్భావం, నాగసాధువుల ప్రవేశం ట్రైలర్‌లో ఉత్కంఠను పంచాయి. ఈ సినిమా అద్భుతమైన థియేట్రికల్ అనుభూతినందిస్తుందని, టీమ్ అంతా ఓ విజన్‌తో పనిచేశామని, నిర్మాణపరంగా అత్యున్నతంగా ఉంటుందని దర్శకుడు అభిషేక్ నామా తెలిపారు. ఈ సినిమా చేయడం దైవానుగ్రహమని, మన సాంస్కృతిక వారసత్వాన్ని ప్రతిబింబించే చిత్రమిదని నిర్మాత కిషోర్ అన్నపురెడ్డి తెలిపారు. పురాతన ఆలయాల రహస్యాన్ని రాబోవు తరాలకు తెలియజేప్పే చిత్రమిదని హీరో విరాట్‌కర్ణ అన్నారు. ఈ కార్యక్రమంలో సంగీత దర్శకులు అబి-జునైద్‌తో పాటు యూనిట్ సభ్యులందరూ పాల్గొన్నారు.

# ఓ యోధుడి ప్రస్థానం



గోపీచంద్ కథానాయకుడిగా నటిస్తున్న చారిత్రక చిత్రం 'భరత వర్ష'. సంకల్ప్ దర్శకత్వంలో శ్రీనివాస చిట్టూరి నిర్మిస్తున్నారు. క్రీ.శ. 642 నేపథ్య కథాంశమిది. శుక్రవారం ఈ సినిమా నుంచి 'వీర జయధీర' అనే తొలిపాటను విడుదల చేశారు. కథానాయకుడి ప్రయాణాన్ని, పరివర్తనను ఆవిష్కరిస్తూ శక్తివంతంగా ఈ పాట సాగింది. ఓ సాధారణ వ్యక్తి నుంచి అసాధారణ యోధుడిగా కథానాయకుడు ఎదిగిన వైనం, లక్ష్యసాధన కోసం చేసిన అతను చేసిన పోరాటాన్ని స్ఫూర్తివతంగా ప్రజెంట్ చేసింది. అనుదీప్‌దేవ్ అందించిన సంగీతం, చంద్రబోస్ సాహిత్యం ఈ పాటలో ప్రధానాకర్షణగా నిలిచాయి. మంచు పర్వతాల నడుమ విజువల్స్ ఆకట్టుకునేలా ఉన్నాయి. హీరో గోపీచంద్ సరికొత్త మేకోవర్‌తో కనిపించారు. ఈ చిత్రానికి సంగీతం: అనుదీప్‌దేవ్, దర్శకత్వం: సంకల్ప్.

# అవినీతిని ప్రశ్నించే పాత్రలో!



అగ్ర నటుడు నందమూరి బాలకృష్ణ కథానాయకుడిగా గోపీచంద్ మలినేని దర్శకత్వంలో ఓ భారీ యాక్షన్ చిత్రం రూపొందుతున్న విషయం తెలిసిందే. 'చీదీఖ 111' వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రంపై అభిమానుల్లో భారీ అంచనాలున్నాయి. బ్లాక్‌బస్టర్ 'వీరసింహారెడ్డి' తర్వాత వీరి కలయికలో వస్తున్న సినిమా కావడమే అందుకు కారణం. బాలకృష్ణ పుట్టినరోజు కానుకగా ఇటీవల విడుదల చేసిన గ్లింప్స్ కూడా సినిమాపై అంచనాలు పెంచింది. వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీశ్ కిలారు నిర్మిస్తున్న ఈ చిత్రంలో కాజల్ అగర్వాల్ కథానాయికగా నటిస్తున్నది. శుక్రవారం ఆమె పుట్టినరోజు సందర్భంగా ఇందులోని కాజల్ పోషిస్తున్న పాత్రను పరిచయం చేస్తూ ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. ప్రభుత్వ కార్యాలయ వాతావరణంలో.. ఫైళ్లు, అధికారిక పత్రాల మధ్య కళ్లజోడుతో హుందాగా నిలబడివున్న కాజల్‌ని ఈ పోస్టర్‌లో చూడొచ్చు. కాజల్ గెటప్‌ని బట్టి, ఇందులో ఆమె ప్రభుత్వ అధికారిణి పాత్ర పోషిస్తున్నదని అర్థమవుతున్నది. ఆత్మవిశ్వాసం, నిబద్ధత, స్థిరత్వం ఆమె కళ్లలో ప్రస్ఫుటంగా కనిపిస్తున్నాయి. 1993 ముంబై నేపథ్యంలో ఉత్కంఠకు గురిచేసే హింసాత్మక ప్రపంచానికి ఎదురునిలిచే డేర్ డెవిల్‌గా ఇందులో కాజల్ కనిపించనున్నట్టు తెలుస్తున్నది. ప్రస్తుతం ముంబైలో చిత్రీకరణ జరుపుకుంటున్న ఈ యాక్షన్ డ్రామాలో మంచు మనోజ్ కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ చిత్రానికి మాటలు: సాయిమాధవ్ బుర్రా, కెమెరా: అరవింద్ .ఎస్ కశ్యప్, సంగీతం: తమన్.

# నాగదుర్గ నాయికగా తెలంగాణ నేపథ్య చిత్రం

తెలంగాణ జానపద గీతాల్లో అద్భుత నాట్యాభినయాన్ని ప్రదర్శిస్తూ మంచి పేరు సంపాదించుకుంది నాగదుర్గ. ఆమె పాటలు, ప్రైవేట్ ఆల్బమ్స్ సోషల్‌మీడియాలో రికార్డు స్థాయి వీక్షణలతో ప్రేక్షకుల్ని అలరించాయి. తాజాగా ఆమె కథానాయికగా అరంగేట్రం చేస్తున్నది. ప్రియదర్శి హీరోగా నటిస్తున్న ఈ చిత్రాన్ని ప్రముఖ దర్శకుడు సుకుమార్, నిర్మాత బన్నీ వాసు తెరకెక్కిస్తుండటం విశేషం. తెలంగాణ నేపథ్య కుటుంబ కథాంశంతో రూపొందనున్న ఈ చిత్రానికి వంశీ రెడ్డి దర్శకత్వం వహించనున్నారు. ఈ నెల 25న లాంఛనంగా సినిమాను ప్రారంభించి, వచ్చే నెలలో రెగ్యులర్ షూటింగ్ మొదలుపెడతామని, ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాలను త్వరలో వెల్లడిస్తామని మేకర్స్ పేర్కొన్నారు. బన్నీ వాస్ వర్క్స్, సుకుమార్ రైటింగ్స్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించనున్నాయి.

